క్లుప్తంగా

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా విశ్వనాథ్ గౌడ్



పహాడీషరీఫ్: బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మామిడిపల్లి గ్రామానికి చెందిన ఈరంకి విశ్వనాథ్ గౌడ్ నియమితులయ్యారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టియాదీష్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ గౌడ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీలో కార్పొరేషన్ స్థాయి నుంచి కష్టపడి పని చేయడం వల్లే తనకు జిల్లా స్థాయిలో పదవి ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ రోజు రోజుకు బలోపేతమవుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తన వంతు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటనన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, మహేందర్, బొక్క నర్సింహా రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

ఓటు హక్కు వజ్రాయుధం

డీఆర్‌డీఓ శ్రీలత



కందుకూరులో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కందుకూరు: ఓటు హక్కు వజ్రాయుధమని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఓటు హక్కుపై అధికారులు, సిబ్బంది, అవగాహన కల్పించారు. ఓటు విలువ తెలిసేలా ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నిరక్షరాస్యులతో పాటు అందరు ఓటు హక్కును వినియోగించుకునేలా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. ఒకే ఓటు చరిత్ర గతినే మారుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఓటర్లను చైతన్యం చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, ఏపీఎం కవిత, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన రాజరాజేశ్వరిదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరి దేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం,పంచామృతాభిషేకంతో పాటు పలు పూజలు చేశారు. ఉదయమే శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.మహిళలు అమ్మవారికి కుంకుమార్చన, దీపాలు వెలిగించి పూజలు చేశారు.అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, ఆలయ ప్రధాన పూజారులు భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



షాహీన్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని బాలాపూర్ పోలీసులు షాహీన్‌నగర్ పరిసరాల్లో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి నేతృత్వంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఎర్రకుంట, సాదత్‌నగర్, షాహీన్‌నగర్, అలైన్ కాలనీ, వెంకటాపూర్‌ల మీదుగా ఈ కవాత్ కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పామన్నారు. పోలింగ్ రోజు ప్రతీ ఓటర్ నిర్భయంగా బూత్‌కు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రౌడీయిజం, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేవారిని ఉక్కుపాదంతో అణచి వేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కవాత్‌లో అదనపు ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్‌ఐలు మహేందర్, సైదులు, జానీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి కళాత్మకం

- సెలవు రోజుల్లో కళలకుప్రాధాన్యం
- శిక్షణ శిబిరాలకు వెళ్తున్న విద్యార్థులు
- ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త పాటించాలి



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: రోజురోజుకు ఎండల తీవ్రత భగ్గున మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా భయాందోళనలు కలిగిస్తున్నాయి. సరూర్‌నగర్ డివిజన్‌లో 44 సెల్సియస్ డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైందంటే పరిస్థితి ఎలా ఉందనేది అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే టెన్త్, ఇంటర్ పరీక్షలు ముగిశాయి. మరో నాలుగు రోజుల్లో ఇతర తరగతులకు సంబంధించిన పరీక్షలు కూడా ముగియనున్నాయి. దీంతో విద్యా సంస్థలకు వేసవి సెలవులు ప్రకటించనుండటంతో శిక్షణా శిబిరాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తూ వారి ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరగకుండా కట్టడి చేయాలి. పిల్లలు ఎక్కువగా క్రికెట్, ఇతర ఆటల పేరుతో రోజంతా బయటే గడుపుతుంటారు. వేళకు సక్రమంగా ఆహారం, నీళ్లు తాగకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఉక్కపోతకు శరీరంలోని నీరు చెమట రూపంలో బయటికి వెళ్లిపోతుండటంతో త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యేప్రమాదం లేకపోలేదు. వడగాల్పులకు తోడు వేళకు ఆహారం తీసుకోకపోవడంతో వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉంది. కీలకమైన ఈ సెలవుల్లో వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే వారికి వేసవి క్రీడా శిబిరాలే రక్షగా నిలుస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

ఇటు వ్యాయామం... అటు శిక్షణ

ఉదయం యోగా శిక్షణ తరగతులు, వాకింగ్, రన్నింగ్, స్కేటింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, కరాటే, స్విమ్మింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇప్పించడం ద్వారా వారికి ఆయా రంగాల్లో అనుభవం సాధించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మే1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో నిపుణుల పర్యవేక్షణలో ఆయా అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహికులు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు.

భాషా కోర్సుల్లో శిక్షణ..

మధ్యాహ్నం ఎండలో బయట ఆడుకోకుండా ఇంటి పట్టున ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమయంలో ఇంగ్లీషు, హిందీ, స్పానిష్ వంటి విదేశీ భాషా కోర్సులపై శిక్షణ ఇప్పించడం ద్వారా పైతరగతుల్లోని పాఠ్యాంశాలపై పట్టు సాధించొచ్చు. కంప్యూటర్ కోర్సులతో పాటు గణితం, సివిల్స్, ఇతర పోటీ పరీక్షలు, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై శిక్షణ ఇప్పించడం ద్వారా విద్యార్థులు మరింతగా మెరుగయ్యే అవకాశం ఏర్పడుతుంది. ఇందిపార్కు సమీపంలోని రామకృష్ణ మఠంలో భాషా కోర్సులపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిని ఉపయోగించుకోవాలని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

పొంచి వున్న ప్రమాదాలు..

- పిల్లలకు ఈతపై ఉన్న సరదాతో సమీపంలోని చెరువులు, కుంటలు, క్వారీ గుంతల్లోకి దిగేలా చేస్తుంది. లోతు తెలియకుండా ఆయా గుంతల్లోకి దిగుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.
- స్నేహితులతో కలిసి టూ వీలర్లపై వేగంగా వెళ్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం కూడా వారి ప్రాణాల మీదకు తెస్తుంది. సాధ్యమైనంత వరకు వాహనాలను పిల్లల చేతికి ఇవ్వకుండా జాగ్రత్త పడాలి.



క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారి



కరాటే ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారిణి



యోగా చేస్తున్న విద్యార్థిని

'కొండా'కు మద్దతుగా ప్రచారం



మీర్‌పేటలో పారిశుద్ధ్య కార్మికురాలిని ఓటు అభ్యర్థిస్తున్న శ్రీరాములు యాదవ్, బీజేపీ నాయకులు

- మూడోసారి నరేంద్రమోడీని గెలిపించండి
- అందెల శ్రీరాములు యాదవ్

మీర్‌పేట: చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మీర్‌పేటలో ప్రచారం చేశారు. ధర్మం కోసం, దేశం కోసం పనిచేస్తున్న నరేంద్రమోడీని మూడోసారి ప్రధాని చేసేందుకు దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్‌లో ప్రచారం చేసి ఓటర్లను బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ దేశాన్ని విభజించి పాలించేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉత్తర, దక్షిణ భారతదేశం అంటూ కాంగ్రెస్ విభజన సిద్ధాంతంతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో మోడీకి, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహా, ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భిక్షపతిచారి, యాదగిరి యాదవ్, జేడీ కుమార్, గోలీ శ్రీనివాస్, ప్రదీప్, నగేష్, విక్కీ సాగర్, రమేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు హక్కు

జిల్లా సంక్షేమాధికారి పద్మజ

మహేశ్వరం: దివ్యాంగులు, వయో వృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం తగిన చర్యలు చేపట్టిందని జిల్లా సంక్షేమాధికారిణి పద్మజ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు మహేశ్వరం ఆధ్వర్యంలో స్వీప్ అవేర్‌నెస్ కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దివ్యాంగులు, వయో వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ర్యాంపు, వీల్ చైర్స్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు ఎన్నికల సంఘం దివ్యాంగులు, వయోవృద్ధులకు కల్పించిందన్నారు. ఫారం నెంబర్ 12 ద్వారా ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేకంగా క్యూ లైన్, సిట్టింగ్ ఏర్పాట్లను చేస్తుందన్నారు. గ్రామాల్లో, బూత్‌లలో ఎంత మంది వృద్ధులు, వయో వృద్ధులు ఉన్నారో వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీఓ శైలజ, డిప్యూటీ తహసీల్దార్లు శేఖర్, నవత, మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ షభానా పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పద్మజ



నడి రోడ్డులో విద్యుత్ స్తంభం

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: కొత్త మున్సిపల్ కార్పొరేషన్ భవనం ఎదురుగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించి సరైన ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి అధికారులు ఆసక్తి చూపించడం లేదని, తమకెందుకన్నట్టు మిన్నకుండిపోతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం ముందునుంచి ఎడమ వైపు వెళితే మారుతినగర్ మీదుగా రాజీవ్ గృహకల్ప ప్రధాన రోడ్డు, అలాగే కుడి వైపు మళ్లితే బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లె రేడియల్ రోడ్డు, ఎదురుగా వెళితే రోమ-2, వైష్ణవి కాలనీ, బీరప్ప కాలనీ, సాయిప్రభుహోమ్స్ కాలనీలకు ఈ రహదారులగుండానే వాహనాలు వెళ్తుంటాయి. ఇప్పుడు ఇది బడంగ్‌పేట మున్సిపల్ చౌరస్తా పెద్ద కూడలిగా మారింది. కానీ ఈ ప్రాంతంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం సరిచేసే వారు లేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకంగా రోడ్డుమధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

- కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్

చేవెళ్ల: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి చింపుల సత్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. రేగడిఘనాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీపోచమ్మదేవి, నాగదేవత, గ్రామ నాభిశిల సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు అంతా కలిసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో ప్రతిష్ఠాపన పూజలు, బోనాల ఉత్సవాలు, పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామదేవతల పూజలు చేయటం అనవాయితీగా వస్తుందన్నారు. ఏళ్లతరబడిగా ఉన్న గ్రామ దేవతల ఆలయాలు, దేవుళ్ల విగ్రహాలను పునఃనిర్మాణాలు, ప్రతిష్ఠలు చేయటం గ్రామాభివృద్ధికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, నర్సింలు, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, టేకుపల్లి శ్రీనివాస్, పెంటయ్య, ఈదులపల్లి రాములు, రాజేశ్, అంజిరెడ్డి, చంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, పాండు, మాణిక్యం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పూజలో బీజేపీ నాయకులు..

రేగడిఘనాపూర్ గ్రామంలో జరిగిన పూజలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు ఆనంద్‌జిత్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా ఎయిర్‌పోర్ట్ రోడ్డు

- ఒకే ప్రాంతంలో వరుస ప్రమాదాలు
- కనిపించని జిబ్రా క్రాసింగ్‌లు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి వివేకానంద చౌరస్తా నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు వేసిన నూతన రహదరి ప్రమాదాలకు నెలవుగా మారింది. ముఖ్యంగా మూల మలుపు వద్ద పూర్తి స్థాయిలో జిబ్రా క్రాసింగ్‌లు వేయకపోవడం, ప్రమాదం జరిగే ప్రాంతం అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల పరంపర కొనసాగుతుంది. ఈ చౌరస్తా సమీపంలోని 150 మీటర్ల దూరంలో మొదటి యూటర్న్ వద్ద మూల మలుపులో ఒకే తరహాలో జరిగిన రెండు ప్రమాదాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. శంషాబాద్ వైపు నుంచి నెల రోజుల క్రితం మిట్ట మధ్యాహ్నం ఎర్టిగా కారు ఇదే మూల మలుపు వద్దకు రాగానే అదుపు తప్పింది. రోడ్డుకు ఎడమ వైపు 15 మీటర్ల మేర దూసుకెళ్లి ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తాజాగా గురువారం అర్ధరాత్రి గతంలో మాదిరిగానే శంషాబాద్ నుంచి వేగంగా వచ్చిన డస్టర్ కారు అదే ప్రాంతంలో అదుపుతప్పి నేరుగా వెళ్లి అదే ప్రహరీని ఢీకొని ఓపెన్ స్థలంలోకి దూసుకెళ్లి అప్పటి కారుపై పడింది. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఒక కారుపై మరో కారు పడి ఉండడాన్ని చూసిన వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో వెంటనే 'గో స్లో' బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న జిబ్రా క్రాసింగ్‌కు కొద్ది వెనుకాల ఒక ట్రెండు క్రాసింగ్‌లు వేస్తే ప్రమాదాలను నివారించేందుకు వీలుంటుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.



ప్రమాదాలకు నెలవుగా మారిన స్పాట్ ఇదే



ఒకదానిపై మరొకటి పడ్డ కార్లు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఐసెడక్ పరిశ్రమ సెక్రటరీ సూచి అగర్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం రాయికల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఐసెడక్ పరిశ్రమ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు కావాల్సిన సదుపాయాల గురించి వారు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పరిశ్రమ సెక్రటరీ సూచి అగర్వాల్ మాట్లాడుతూ పాఠశాలలో సుమారు రూ.40లక్షలతో మరుగుదొడ్లను నిర్మిస్తామని, సమావేశ మందిరం ,హెచ్‌ఎం గది నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు.విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమ సిబ్బంది రేణుక,ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం ,హెచ్‌ఎం జయమ్మ,ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శించిన పరిశ్రమ సిబ్బంది

ఈదురు గాలుల బీభత్సం



పెద్దమ్మగుడి శ్రీశైలం జాతీయ రహదారిపై విరిగిన వృక్షాన్ని తీస్తున్న పోలీసులు, స్థానికులు



తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారిపై వృక్షాలు, చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

- విరిగిన వృక్షాలు, తెగిన విద్యుత్ స్తంభాలు
- శ్రీశైలం జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

మహేశ్వరం: భారీ ఈదురుగాలులతో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల పరిధిలోని తుమ్మలూరు, తుమ్మలూరు గేటు, రాచులూరు గేటు పెద్దమ్మ గుడి వద్ద శ్రీశైలం జాతీయ రహదారిపైన శుక్రవారం రాత్రి భారీ ఈదురు గాలులు వీచాయి. దీంతో శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న భారీ వృక్షాలు నెలకొరిగాయి. అవి రోడ్డుపై పడడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుకు అడ్డంగా వృక్షాలు విరిగి, కూలడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో మహేశ్వరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కూలిన వృక్షాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపైన వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ స్తంభాలు, తీగలను మరమ్మత్తులు చేసి పునరుద్దరించారు.

కందుకూరులో..

కందుకూరు: మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని మామిడి తోటలో కాయలు నేలరాలి రైతులకు నష్టం వాటిల్లింది. అధికారుల పర్యటన అనంతరం నష్టం అంచన తేలనుంది.